సామెత (జాతీయముల )కథలు

## సింగినాదం జీలకఱ్ఱ

- **శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.**

నెల్లూరు మండలంలో సింగారం అనే పేరుగల గ్రామం ఉండేది. అక్కడ జీవించేవి నాల్గువందల కుటుంబాలు మాత్రమే. అయినా అచ్చట అందఱు కోటికి పడగెత్తిన భాగ్యవంతులుగానే ఉండేవారు. ఒక్కొక్కడే నూర్ల కొలది యకరాలు వ్యవసాయం చేయించుకొంటూ పాడిపంటలతో సుఖిస్తూ ఉండేవారు. అపర కుబేరులనదగ్గవాండ్రకు ధనకనకవస్తువాహనసమృద్ధి కలదని వేఱే చెప్ప నక్కఱలేదు. తమకు కావలసిన యావత్తు గృహసంభారాలు సాలు కొక్కసారిగా కొనుక్కొని నిల్వ చేసికొంటూండడం వారి అలవాటు.

అప్పుడప్పుడు కొందరు దోపిడిగాండ్రు ఒక్క సంఘంగా చేరి, కత్తులు, కటారులు, బల్లాలు చేత పుచ్చుకొని గుఱ్ఱాలపై స్వారి చేస్తూ, హఠాత్తుగా ఊళ్ళో జొరబడి దాడిచేసేవారు. శృంగనాదాలు చేస్తూ వెండి, బంగారలేకాక యింకను అవసరమైన సామాగ్రి దోచుకొని పారిపోతూండేవారు. పాపం ఆ యూరి ప్రజలు కష్టించి గడించి కూడబెట్టుకున్న చరాస్తులు పోయినందుకు కొన్నాళ్ళు విచారించేవారు. ఇల్లు వాకిళ్ళకు, స్థిరాస్తులకు, తమ మాన ప్రాణాలకు, కొంచమైనా హాని కలగనందులకు సంతోషిస్తూ కాలం గడుపుకొనేవారు. పెద్ద పెద్ద స్థిరాస్తులు కలవారు కావడంచేత ఎవరి మట్టుకు వారే తిరిగి, నగలూ-నట్రా చేయించుకొని ఎప్పటిలాగు మట్టుపడుతూండేవారు.

రుచి మఱగిన కుక్క మఱచిపోదన్నట్లు గూండాలు మూడేండ్ల కొక్కపర్యాయం తిరిగి యథాపూర్వంగానే పెద్దసంరంభంతో దాడిచేసి, భాగ్యమంతా కొల్లగొట్టుకొని పోతూండేవారు.

ఇది ఆ గ్రామానికి ఒక పరిపాటి అయిపోవడంచేత వారు ఎవ్వరికి తెలియకుండా మిక్కిలి గూఢంగా ఉండే నేల సొరంగాలు అమర్చుకొన్నారు. సింగినాదం వినేటప్పటికల్లా తమ వెండి బంగారాలు సొరంగాలలో భద్రంగా దాచుకోవడం నేర్చారు. అందుచేత ఏమీ దొఱకక, దోపిడిగాండ్రు తఱచురావడం మానివేశారు.

ఒకరోజున ఊరిచివర చెవులు గింగురుమనేటట్లు ఒక్క సింగినాదం వినవచ్చింది. వెన్నుమీద పిడుగుపడ్డట్లు ఆ యూరిలోని ప్రజలంతా తత్తఱపాటుతో తమ యావత్తు వెండిబంగారాలు గబగబా సొరంగాలలో సర్దుకోవడం మొదలుపెట్టారు. ఎప్పుడువచ్చి గూండాలు తమ మీదపడి నిలువుదోపు దోచుకొంటారో అని ప్రజలంతా గజగజ లాడిపోతున్నారు.

ఇంతలో ఊరిబయటినుండి వచ్చిన వ్యక్తి ఒక్కడు ఊరివారి సంరంభం అంతా చూచి "గాబరా పడకండి. ఏమీ ఫరవాలేదు. ఊళ్ళోకి టోకు జీలకఱ్ఱ వర్తకులు వచ్చారు. ఆ ధ్వని వారూదిన సింగినాదం. ఆ సింగినాదం జీలకఱ్ఱసింగినాదం" అని నాలుగువీదుల మొగలలోను ఎలుగెత్తి అఱచాడు. అప్పుడు ప్రజలంతా కూడ ఎవరిమట్టుకు వారు ఫరవాలేదు. ఆ సింగినాదం జీలకఱ్ఱసింగినాదం అని గట్టిగా అఱచారు. అది పదిమంది అఱవడంతో తాఱుమాఱై సింగినాదం-జీలకఱ్ఱగా మాఱింది.

అది మొదలు ఆంధ్రదేశంలో విషయం ఏమీలేదని చెప్పడానికి బదులుగా సింగినాదం జీలకఱ్ఱ అంటూండడం కూడా ప్రజలకు అలవాటయింది.

***

(సింగినాదం = దుప్పికొమ్ముతో చేసిన వాద్యవిశేషం)